నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, మంగళవారం 17 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

# నేడు అంబేద్కర్ విగ్రహాలకు వినతులు

- లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి
- బీఆర్ఎస్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు తాతా, రేగా





ఖమ్మం/మణుగూరు టౌన్, డిసెంబర్ 16: లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించాలని ఆ పార్టీ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు తాతా మధు, రేగా కాంతారావు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరును ప్రజలు, రైతులకు తెలియజేసేలా కార్యక్రమం చేపట్టాలని పేర్కొన్నారు. ఇదే అంశంపై మాజీ మంత్రి అజయ్ పిలుపుమేరకు ఖమ్మం జడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చే కార్యక్రమం చేపట్టామని పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మరో ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి జిల్లాలోని అన్ని మండలాల్లో ఉదయం 11 గంటలకు అంబేద్కర్ విగ్రహాలకు వినతులు సమర్పించాలని పార్టీ శ్రేణులను రేగా కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరు కావాలని తాతా మధు పిలుపునిచ్చారు.

# తెలంగాణ రామయ్యకు ఆంధ్రా నెయ్యి!

- నెయ్యి టెండర్లపై ఆక్షేపణ వ్యక్తం చేస్తున్న భక్తులు
- దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు సైతం బేఖాతర్



భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చి లడ్డూ తయారీని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్(ఫైల్)

భద్రాచలం, డిసెంబర్ 16 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో రామయ్య లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యిపై పలు విమర్శలు వస్తున్నాయి. గత పదేళ్లుగా లడ్డూ తయారీకి కరీంనగర్ డెయిరీ పేరుతో సరఫరా చేసే నెయ్యిని వినియోగిస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో జరిగిన టెండర్లలో కరీంనగర్ డెయిరీకి కాకుండా.. ఆంధ్రా ప్రాంతంలోని జంగారెడ్డిగూడెంకు చెందిన ఓ డెయిరీ ఫాం నెయ్యిని లడ్డూ తయారీకి వాడుతున్నారు. ఇటీవల దేవస్థానంలో జరిగిన నెయ్యి టెండర్ల ప్రక్రియలో కరీంనగర్ డెయిరీ జీఎస్టీతో కలిపి కిలోకు రూ.610కి వేయగా.. జంగారెడ్డిగూడెంలోని రైతు డెయిరీ జీఎస్టీతో కలిపి కిలోకు రూ.534.24కు టెండర్ వేసి దక్కించుకుంది.

ప్రధాన ఆలయాలకు రెండేళ్లపాటు నెయ్యి సరఫరా చేసిన అనుభవం, ఏడాదికి రూ.10 కోట్ల టెండర్లు వేసి ఉండాలన్న నిబంధనలో రైతు డెయిరీ అర్హత సాధించకపోయినా.. ఈ టెండర్‌ను ఆలయ అధికారులు రైతు డెయిరీకి కట్టబెట్టడంపై భక్తుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అటు దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలను సైతం బేఖాతర్ చేయడం పట్ల పలువురు మండిపడుతున్నారు. టీటీడీ లడ్డూ తయారీలో వివాదం జరిగినప్పటి నుంచి తెలంగాణ ఆలయాల్లో కూడా లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యి విషయంలో నాణ్యత కోసం ప్రభుత్వ డెయిరీల నుంచే నెయ్యిని కొనుగోలు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే వాటిని ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నెయ్యి టెండర్ల విషయంలో మరోసారి పరిశీలించి తెలంగాణ ప్రాంతంలోని డెయిరీల నుంచి నెయ్యి సరఫరా జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బాల్యం.. బలహీనం



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు (ఫైల్)

- ఆందోళన కలిగిస్తున్న పౌష్టికాహార లోపం
- తక్కువ బరువుతో తరచూ అనారోగ్యం
- ఆశించిన ఫలితాలివ్వని అంగన్‌వాడీ కేంద్రాలు
- కొరవడిన ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ
- చిన్నారుల్లో తగ్గిపోతున్న చురుకుదనం

**మాతా, శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలామంది పిల్లల బాల్యం ఇంకా బలహీనంగానే ఉంటోంది. ఫలితంగా పిల్లల్లో పౌష్టికాహార లోపం తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నది. తక్కువ బరువు, తీవ్ర పోషకాహార లోపం, వయస్సుకు తగ్గ ఎత్తు లేకపోవడం వంటి కారణాలతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రతి ఏటా అవగాహన కల్పిస్తున్నా.. పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నా ఆశించిన ఫలితం రావడం లేదు. దీంతో ఐసీడీఎస్ అధికారుల తీరు తల్లిదండ్రులను తీవ్ర అసహనానికి గురిచేస్తున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా 11 ప్రాజెక్టుల పరిధిలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 70,677 మంది పిల్లలు ఉన్నారు. వీరిలో 821 మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. 369 మంది బరువు తక్కువ పిల్లలు, 452 మంది ఎత్తుకు తగ్గ బరువులేని పిల్లలు ఉన్నారు.**

*- అశ్వారావుపేట, డిసెంబర్ 16*

తల్లీబిడ్డ ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా సంపూర్ణ ఫలితం దక్కడం లేదు. ఏటా పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తీవ్ర పోషకాహార లోపం, తక్కువ బరువు, ఎత్తుకు తగ్గ బరువు ఉండడం లేదు. ఈ పిల్లలంతా మధ్య, పేద వర్గాలకు చెందిన వారే. ఫలితంగా తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. తక్కువ బరువుతో పుట్టిన పిల్లల్లో వయస్సు పెరిగేకొద్దీ అనారోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఐదేళ్లలోపు చిన్నారులను రక్తహీనత వెంటాడుతున్నది. దీని కారణంగా చిన్నారుల్లో ఉత్సాహం, చురుకుదనం కనిపించకపోగా తోటిపిల్లలతో ఆడుకునే పరిస్థితికి దూరమవుతున్నారు. ఇటువంటి వారిని గుర్తించి పౌష్టికాహారం అందించి అనారోగ్య సమస్యల నుంచి చిన్నారులను కాపాడటంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)



బాలుడి ఎత్తు కొలత సేకరిస్తున్న టీచర్

## బాలామృతం... కోడిగుడ్డు

జాతీయ పౌష్టికాహార సంస్థ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చిన్నారుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం బాలామృతం, కోడిగుడ్లు, భోజనం, పాలు సరఫరా చేస్తూనే ఉంది. 7 నెలల నుంచి 3 ఏండ్ల లోపు పిల్లలకు నెలలో 16 కోడిగుడ్లు, బాలామృతం రెండున్నర కేజీల ప్యాకెట్‌ను అందిస్తున్నది. తీవ్ర పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు సూపర్‌వైజరీ ఫీడింగ్ కింద భోజనం పెడుతున్నది. 3-6 ఏళ్లలోపు పిల్లలకు భోజనం, స్నాక్స్, పాలతోపాటు రోజుకు ఒకటి చొప్పున నెలకు 30 కోడిగుడ్లు సరఫరా చేస్తున్నది. వీటిని పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఉడికించి ఇవ్వాల్సి ఉంది. కానీ.. ఇంటికి పంపించడం వల్ల సక్రమంగా పోషకాహారం అందడం లేదనే వాదనలు ఉన్నాయి.

## పర్యవేక్షణ కరువు..

గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలనేది సర్కార్ లక్ష్యం. ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్, బాలామృతం, ఆరోగ్యలక్ష్మి, హెల్త్‌చెకప్ వంటి కార్యక్రమాలు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోనే ఉంటాయి. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి పుట్టిన బిడ్డకు ఐదేళ్లు నిండే వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి పౌష్టికాహారం అందిస్తున్నది. అలాగే వారి ఆరోగ్య సంరక్షణ బాధ్యత కూడా అంగన్‌వాడీ కేంద్రాలదే. అయితే అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడం కారణంగా సత్ఫలితాలు అందడం లేదనే చర్చ వినిపిస్తున్నది. కేవలం వారోత్సవాలు, ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసే సమయంలో తప్ప అధికారులు మిగతా టైమ్‌లో పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

## వారోత్సవాలతో ప్రయోజనం శూన్యం..

పౌష్టికాహారం ప్రయోజనాలు, వాటి సక్రమ వినియోగంపై ప్రభుత్వం ఏటా పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహిస్తున్నది. అయినా ప్రయోజనం లేకుండా పోతున్నది. కార్యక్రమాల నిర్వహణలో అధికారులకు చిత్తశుద్ధి ఉండడం లేదని, కేవలం విధి నిర్వహణలో భాగంగా నామమాత్రపు పర్యవేక్షణతో అధికారులు లక్ష్య సాధనలో నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ని కార్యక్రమాలు చేసినా అధికారుల్లో చిత్తశుద్ధి లేనప్పుడు ప్రయోజనం ఏముంటుందని తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు.

## కారణాలేమిటంటే...?

బాల్య వివాహాలు, అనారోగ్యం, పేదరికం, అవగాహన లేమి కారణంగానే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చిన్న వయస్సులోనే గర్భం దాల్చిన మహిళలు నెలలు నిండకుండానే ప్రసవిస్తున్నారు. అటువంటి పిల్లలకు పుట్టుకతోనే అనేక రుగ్మతలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం సక్రమంగా తీసుకోకపోవడం, పోషకాహార లోపం వల్ల కలిగే ఇబ్బందులను అర్థమయ్యేలా గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పించలేకపోవడం, ఐసీడీఎస్ అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పూర్తి పర్యవేక్షణ లేకపోవడం మరో ప్రధాన కారణంగా కనిపిస్తున్నది.

### క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి



పిల్లలు ఆరోగ్యకరంగా ఉండాలంటే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పాలు, గుడ్లు, పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. ముఖ్యంగా రక్తహీనత లేకుండా ఆకుకూరలు, పాలు, గుడ్లు తీసుకోవాల్సి ఉంటుంది. వీటిని నిర్లక్ష్యం చేయడం ద్వారా పౌష్టికాహార లోపంతో పిల్లలకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి.

**– డాక్టర్ రాధా రుక్మిణి, ప్రభుత్వ వైద్యురాలు, అశ్వారావుపేట**

### ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..



లోపపోషణ ఉన్న పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మామ్ పిల్లలకు బాలామృతం, సామ్ పిల్లలకు బాలామృతం+తీవ్ర పోషకాహార లోపం పిల్లలను భద్రాచలం ఎన్ఆర్‌సీ (న్యూట్రిషియన్ రిహాబిటేషన్ సెంటర్)కు పంపిస్తున్నాం. ఏటా వారోత్సవాలు నిర్వహించి పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలు, అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి సూపర్‌వైజర్ నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

**– కొయ్యల ముత్తమ్మ, సీడీపీవో, అశ్వారావుపేట**

# రోడ్డెక్కుతున్న ఉద్యోగులు

- సీఎం హామీలు విఫలమైన ఫలితం..
- మొన్న ఆశాలు, నిన్న సీఆర్‌టీలు..
- నేడు మధ్యాహ్న భోజన వర్కర్లు
- రేపు రోడ్డెక్కనున్న మెప్మా ఉద్యోగులు
- మద్దతు తెలుపుతున్న కార్మిక సంఘాలు
- ధర్నాలతో దద్దరిల్లుతున్న ధర్నాచౌక్



కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద 48 గంటల సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో సకల ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రెండు నెలలుగా జిల్లా వ్యాప్తంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నుంచి మొదలుకొని చిరుద్యోగులు వరకూ ఆందోళనలు కొనసాగిస్తున్నారు. నెలల వేతనాలు అందకపోవడంతో ఆకలి కేకలతో రోడ్డెక్కుతున్నారు. హైదరాబాద్ వచ్చి సమస్యలు చెప్పుకుందామంటే పోలీసుల ద్వారా నిర్బంధాలు చేయిస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక సమ్మెలు కొనసాగిస్తూనే కలెక్టరేట్ ధర్నాచౌక్ దద్దరిల్లేలా ధర్నాలు చేస్తున్నారు. ఒకవైపు అంగన్‌వాడీలు, మరోవైపు ఆశా కార్యకర్తలు, సర్వశిక్షా ఉద్యోగులు, మెప్మా ఆర్‌పీలు, మధ్యాహ్న భోజన వర్కర్లతోపాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు సైతం పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు.

## కార్మిక సంఘాల మద్దతు

సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కుతున్న చిరుద్యోగుల సమ్మెలకు కార్మిక సంఘాలు, పలు పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, ఎన్‌డీ సహా ఇతర కుల సంఘాలు కూడా మద్దతు తెలిపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నాయి. ఎన్నికల హామీలు అమలు చేయాలని, చిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఆశాల సమస్యలపై బస్సు యాత్ర..

పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇవ్వాలని, ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని ఆశాలు పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తున్నారు. ఆందోళనను మరింత ఉధృతం చేసే క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రను కూడా ప్రారంభించారు. నారాయణపేట నుంచి ఈ యాత్రను సీఐటీయూ ప్రారంభించింది. ఈ నెల 26న భద్రాద్రి జిల్లాలో కళాజాతా నిర్వహించనుంది.





ఏడు రోజుల నుంచి సమ్మెలో పాల్గొన్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు(ఫైల్)

## ధర్నాలతో దద్దరిల్లుతున్న ధర్నాచౌక్..

కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నాచౌక్ ధర్నాలు, నిరసనలతో దద్దరిల్లుతోంది. ఒకవైపు వంటావార్పు, మరోవైపు ఆందోళనలు చేస్తూ ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేస్తున్నారు. వీరికి ఉద్యోగ సంఘాలు కూడా సంఘీభావం తెలుపుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం మెప్మా ఉద్యోగులు సైతం ధర్నా చేయడానికి నిర్ణయించారు. ప్రతి రోజూ ఇంటెలిజెన్స్ విభాగం పోలీసులు నివేదికలు పంపుతున్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం చిరుద్యోగుల ధర్నాలపై స్పందించడం లేదు. దీంతో ఉద్యోగులు తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తున్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకొని మరీ నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన వర్కర్లు 'గుప్పెడు బియ్యం, పిడికెడు పప్పు' కార్యక్రమం ద్వారా 48 గంటలపాటు దీక్షకు దిగారు. సర్కారు దిగి వచ్చేదాకా తమ ధర్నాలు ఆగవంటూ హెచ్చరిస్తున్నారు.

### భోజనం వండే వాళ్లమే పస్తులుంటున్నాం..



బడిలోని పిల్లలందరినీ మా పిల్లలుగా చూసుకుంటున్నాం. వారికి వండి పెట్టాలనే బాధ్యతతో, వారి ఆకలి తీర్చాలన్న ఆరాటంతో వేకువజామునే నిద్ర లేని ఇంట్లో పనులు ముగించుకొని త్వరత్వరగా స్కూలుకు చేరుకుంటున్నాం. ఖర్చులు భరించి పిల్లలకు మంచి భోజనం పెడుతున్నాం. మరి మా సమస్యలను పట్టించుకోకపోతే ఎలా? ఇచ్చే మూడు వేల గౌరవ వేతనమూ సక్రమంగా ఇవ్వడం లేదు. మార్కెట్‌లో రేట్లు అమాంతం పెరిగినప్పటికీ ప్రభుత్వం మాత్రం పాత ధరలనే ఇస్తోంది. ఇక బిల్లులైతే నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. పిల్లలకు వండి పెట్టేవాళ్లమే పస్తులుంటున్నాం.

**–ఎస్‌కే సుల్తాన, మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధ్యక్షురాలు**

### దుకాణం దగ్గర అరువు ఇస్తలేరు..



ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదు. మా చేతిలో ఉన్న నగదు మొత్తం పిల్లల మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికే వెచ్చిస్తున్నాం. పాత బకాయిలు చెల్లించని కారణంగా దుకాణాల దగ్గర సరుకులు అరువుగా ఇస్తలేరు. ఇకవేళ దుకాణదారులు ఇచ్చినా ఎక్కువ రోజులైతే అడుగుతున్నారు. బిల్లులను ప్రభుత్వం త్వరగా ఇవ్వకుంటే మేమెక్కడి నుంచి తేవాలి? ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మా బతుకులతో ఆడుకుంటోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం మర్చిపోయింది.

**–ఈశ్వరమ్మ, కొత్తగూడెం**

### సర్కారును కదిలిస్తాం..



సమస్యలు చెప్పుకునేందుకు హైదరాబాద్ వెళితే అరెస్టు చేస్తున్నారు. ఇక్కడ ధర్నా చేస్తే పట్టించుకోరు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. ఆశా కార్యకర్తల సమస్యలంటే అలుసుగా ఉన్నట్లుంది. అందుకే మా సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతున్నాం. ఈ నెల 26న ఆశాల బస్‌యాత్ర ఉంది. సర్కారును కదిలిస్తాం. సమస్యల పరిష్కారం కోసం ఎంత వరకైనా వెళ్తాం.

**–పద్మ, సీఐటీయూ నాయకురాలు, కొత్తగూడెం**

### బోధన జరగకున్నా పట్టించుకోవడం లేదు..



భద్రాద్రి జిల్లావ్యాప్తంగా విద్యాశాఖలో 800 మందికి పైగా ఉద్యోగులు ధర్నా చేస్తుంటే కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో బోధన నిలిచిపోయింది. అయినా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కేజీబీవీల్లో పిల్లలకు చదువు లేకున్నా ఏంకాదని ప్రభుత్వం అనుకుంటున్నట్లుగా ఉంది. అందుకే ఆ పిల్లలకు క్లాసులు జరగకున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం దిగిరాకపోతే అంతుచూస్తాం.

**–నాగ శ్రావణి, కంప్యూటర్ ఆపరేటర్, జూలూరుపాడు**

# 'రైతు భరోసా' అమలు చేయాలి

- రాష్ట్రంలో రైతుల ఆందోళనలపై నిర్బంధం ఎత్తివేయాలంటూ ధర్నా
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్





రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

ఖమ్మం రూరల్, డిసెంబర్ 16 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలో రైతు భరోసా అమలు చేయాలని, రైతుల ఆందోళనలపై నిర్బంధం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కమిటీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు రైతు సంఘం నాయకులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ రైతు భరోసాపై కాంగ్రెస్ సర్కార్ ఏడాది కాలంగా ఊరిస్తున్నదని, వాయిదాలతోనే కాలం వెళ్లదీస్తున్నదని ఆరోపించారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నదని, రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న అనేక మందికి ఇప్పటివరకు మాఫీ కాలేదని పేర్కొన్నారు. నాల్గవ దఫా రూ.3 వేల కోట్ల రుణమాఫీ ప్రకటించామని చెప్పి నేటివరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదని, కేవలం 50 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లలో అధికార యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఈ నెల 28వ తేదీ నుంచి అమలు చేయబోయే ఆర్థిక చేయూత పథకాన్ని భూమిలేని ప్రతి పేదవాడికి అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ పీ రాంప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలాన, రైతు సంఘం నాయకులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, చందర్‌రావు, బి.రాంకోటి, పెద్ద వెంకటరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్, వెంపటి రాము తదితరులు పాల్గొన్నారు.





శాసన మండలిలో పలు అంశాలపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

## బాలల సదనాన్ని తీర్చిదిద్దాలి: కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 16: బాలల సదనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఖమ్మంలోని బాలల సదనం భవనాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలల సదనంలో చేపట్టాల్సిన మరమ్మతుల పనులు, పిల్లలకు అహ్లాదం కోసం కల్పించాల్సిన ఆట పరికరాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలల సదనం స్థలంలో ఉన్న బండలను తొలగించి భూమి చదును చేయాలని సూచించారు. అక్కడ పిల్లలకు అహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా ఉయ్యాల, జారుడుబండ, షటిల్ కోర్టు వంటి ఆటల ఆట స్థలాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.